

# శ్రీ...గారు

ఆర్. కుసుమ కుమారి

"సెలవుల్లో యింట్లోవుండి ఏం చేస్తావు? నాకూ తోచటంలేదు. ఒకసారి రాకూడదా! కృష్ణ కూడా రమ్మని వ్రాయమన్నాడు...."అంటూ సగం ఆప్యాయంగా సగం నిష్ఠూరంగా వ్రాసిన పెద్దమ్మ వుత్తరం చూసి ప్రయాణమయింది నీరజ.

మరీ చిన్నవూరు కాకపోయినా పల్లెటూరు అంటేనే చాలా విసుగు నీరజకు. కాని పెద్దమ్మ, పెదనాన్నలు మురిపెంగా చూడటం, వచ్చేపోయేవాళ్ళు ఎవరని కుతూహలంగా అడిగి తెలుసుకోవటం యివన్నీ నీరజకు సరదాగానే వుంది. ఈ మధ్య కాలంలో యీ వూరు రాను కుదరలేదు. పైగా కృష్ణ కూడా చదువురీత్యా నీరజ యింట్లోనే వుండటం.

బి యస్సీ ప్యాస్ అయిన కృష్ణ వున్నట్లుండి యిక నేను చదవనని ప్రకటించటం. సేద్యంచేస్తానని చెప్పటంతో నీరజ ఆశ్చర్యపోయింది. "పల్లెటూర్లో ఎలా తోస్తుందని అడిగితే "సేద్యం అంటే మాటలా.... అసలు టైమే వుండదు" అన్నాడు.

"పిల్లనెవరిస్తారన్నయ్యా?" .... కొంటెగా అడిగింది.... "ఏ పిల్లని....?"

"అదే అమ్మాయిని...." చెప్పింది నీరజ.

"వచ్చే ఆవిడే వస్తుంది. ముందు బావగారి సంగతి చూసుకోమ్మా చెల్లెలా...." ఎగతాళి చేశాడు ఆ రోజు.

"పోస్టు..."ఆలోచనల మధ్య చేరుకొని లెటర్ అందుకుంది. తన ఫ్రెండ్ కాదు గదా? కాదే! అక్షరాలు క్రొత్తగావున్నాయి. పైగా. "శ్రీకృష్ణగారు" అంటూ భలే మర్యాదగా వ్రాశారు అన్నయ్యకు. ఎవరై వుంటారబ్బా! ఫ్రెండ్స్ అలా తమాషా చేయను అతి మర్యాదలు ఒలకపోస్తూ వ్రాస్తారు-అదే అయివుంటుందనుకుంది నీరజ.

"ఎవరమ్మా లెటర్ వ్రాసింది.... నీ ఫ్రెండా?"....లోపలికి వస్తూ అడిగాడు కృష్ణ. "కాదన్నయ్యా నీకే. ఎవరో చాలా మర్యాదగా వ్రాశారు" అంటూ అందించింది నీరజ.... చింపి గబ గబ చదివి 'సారీ' అన్నాడు అప్రయత్నంగా "ఎవరికి?...." "భారతికే" అని నాలుక్కొరుచుకున్నాడు కృష్ణ.

"భారతా....ఓహో సార్థక నామధేయురాలు. ఎవరన్నయ్యా యీవిడ" అడిగింది నీరజ.

"నీకు తెలీదుకదూ! నా కాబోయే భార్యామణి....త్వరలో మేరేజి" చెప్పాడు కృష్ణ.

"ప్రేమించావా?...." ఆశ్చర్యంగా అడిగింది నీరజ.

"లేదు! తెలుసు. యీ పెళ్లి ద్వారా యింకొంచెం పరిచయం." "మరిలేటు దేనికి? పెళ్లి చేసుకోవచ్చుగా" అడిగింది నీరజ. "తనకి పరీక్షలయ్యాక!" "పరీక్షలా"? ఏ టెన్తో అయివుంటుంది లేకపోతే కాబోయే భర్తకు అంతమన్ననగా లెటర్ వ్రాయటమా అనుకుంది నీరజ.

"బి యస్సీ...." "డిగ్రీనా"? "అవునమ్మా.... అందుకే ఎగ్జామ్స్ వరకు వెయిట్ చేసేది...."

"బాగుంది.... మరి యీ శ్రీ.. గార్లు ఏమిటన్నాయ్ మరీ అతిమర్యాదగా..ఎవరో మినిస్టరు గారికి వ్రాసినట్లు పైగా చదువుకుంది....ఏదో ఒకటి వ్రాయవచ్చుగా....!"

"నిజమే నీరజా.... నేనూ చెప్పేను.... వింటేనా! మీ పేరు ముందుగా శ్రీ లేకపోతే బాగుండదు. కృష్ణ అని వ్రాసినాక అలాగే వదిలేయటం నాకు నచ్చదు. అందుకని ఈ గారు కూడా తగిలిస్తానని ఒకసారి చెప్పింది" అంటూ కాబోయే భార్యామణి గూర్చి మహాసంబరంగా చెప్పుకుంటున్న అన్నగారిని చూసి చాలా ఆనందపడింది నీరజ.

*

రైల్వే స్టేషన్ దగ్గర ఫుట్‌పాత్ మీద అంతా సందడిగా వుంది. పళ్ళు, పూలు, తినుబండారాలు అమ్ముకొనేవాళ్ళతోను, హస్తసాముద్రికం చిలకజోస్యపుగాళ్ళతోనూ చాలా కోలాహలంగా వుంది. ఒక మూలగా ఒక చేత్తో గొడుగు, మరోచేత్తో పెట్టె పట్టుకుని తనదగ్గరకు ఎవరొస్తారా అని ఎదురుచూస్తు వచ్చేపోయే వాళ్ళముఖాలకేసి జుట్టు గడ్డాల కేసి చూస్తున్నాడో మనిషి.

అంతలో ఒక రిక్షావాలా ఆ మనిషి దగ్గరకు వచ్చి "క్షవరానికి ఎంతయ్యా?" అని అడిగాడు.

"గొడుగు పట్టుకూర్చుంటేముప్పావలా పట్టుకోకపోతే రూపాయవుతుంది."

"అట్లాగా" అన్నాడా రిక్షావాలా!

కూలీ నాలీ చేసుకునేవాళ్ళు, రిక్షాబండ్లు తోలేవాళ్ళు, రైల్వే కూలీలు, స్వీపర్లు మొదలైనవాళ్ళు తప్పితే ఎవరు రారు అక్కడికి! ఎందుకంటే ఎయిర్ కండిషన్డ్ షాపుల్లో కుషన్ చైర్లో కూర్చొని చేయించుకునేంత ఆర్థిక స్తోమతు వాళ్ళకు లేదుగనుక

"అయితే సరే! చెయ్!"అన్నాడా రిక్షావాలా!

ఇంక పని కుపక్రమించాడు వీరయ్య. పెట్టెలోంచి చిన్న అద్దం ముక్కను తీసి ఒక చేత్తో పట్టుకోమన్నాడు. కత్తిని తీసుకొని సాన మీద అరగతీయటం మొదలె